# విపశ్యన మాసపత్రిక

VOLUME:35 NO - 26 1 JUNE, 2020

(సాధకుల ప్రేరణ కొరకు ఉద్దేశించబడిన తెలుగు మాసపత్రిక)

విపశ్యన అంతర్జాతీయ ధ్యాన కేంద్రం, ధమ్మఖేత్త, వనస్థలిపురం, హైదరాబాదు - 70


**"ధర్మవాణి"**

అసాహసేన ధమ్మేన, సమేన నయతీ పరే ।
ధమ్మస్స గుత్తో మేధావీ, 'ధమ్మట్ఠో'తి పవుచ్చతి ॥

*- ధమ్మపద - 257, ధమ్మట్ఠవగ్గో*

ధర్మపూర్వకంగా, ధైర్యంతో, నిష్పక్షపాతంగా ఇతరులకు మార్గదర్శనం చేయు ధర్మరక్షకుడైన మేధావి 'ధర్మిష్ఠుడు' అనగా ధర్మవంతుడు అనబడతాడు.

# విపశ్యనా సాధన స్వర్ణ జయంతి సందర్భంగా పూజ్య గురూజీ పట్ల కృతజ్ఞతను ప్రకటించుకునే సదవకాశం

*విపశ్యనా సాధన పునఃస్థాపితమై 50 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా 3 జూలై 2018 నుండి గ్లోబల్ పగోడాలో, ప్రతిరోజూ ఒక్కరోజు శిబిరాలు క్రమబద్ధంగా నిర్వహించబడుతున్నాయి. ఈ శిబిరాలు సాధకులు తమ నిత్య, సాధనను బలపరుచుకోవటానికి ఉపయోగపడుతుందని ఆశించటం జరుగుతోంది. సాధకులు ఏరోజు సమయం దొరికితే, ఆ రోజు ఈ శిబిరాల నుండి ప్రయోజనం పొందవచ్చు. వీటితో సాధకుల సాధనలో కూడా నిరంతరత మరియు క్రమబద్ధత వచ్చి, తద్వారా ఇతరులలో ప్రేరణ కలిగి సద్ధర్మం పట్ల ఆసక్తి కలిగితే, వీలయినంత ఎక్కువ మంది శిబిరాల్లో పాల్గొని, తమ మేలు చేకూర్చుకుంటారు. ఇదే విధంగా, ఇతర ప్రాంతాల్లో కూడా, రోజువారీ సాధన, సామూహిక సాధన మరియు ఒక్కరోజు శిబిరాల ద్వారా ఈ విద్య యొక్క వ్యావహారిక పక్షాన్ని అంటే సాధన యొక్క ఆచరణను దృఢపరుచుకోడానికే ఈ శిబిరాలు జరుపుకోబడ్డాయి. ఇదే పూజ్య గురుదేవుల పట్ల మనం చూపించే అసలైన శ్రద్ధాంజలి, నిజమైన కృతజ్ఞత అవుతుంది.*

*విశ్వ విపశ్యనాచార్యులు పూజ్య శ్రీ సత్యనారాయణ గోయంకా గారు శుద్ధ ధర్మంతో సంపర్కంలోకి రాకముందు, వారి బాల్యం నుండి యవ్వన దశ వరకూ జరిగిన సంఘటనల వర్ణనల ఆధారంగా వారిలోని భక్తిమార్గ భావాన్ని గురించి ఎలాంటి భ్రమా కలగకూడదు, పైపెచ్చు, ధర్మం చేత అలాంటి వ్యక్తిలో కూడా ఎంతలా మార్పు వచ్చిందో తెలుసుకొని ప్రేరేపితులౌతారనే ఉద్దేశ్యంతోనే, వారి ఈ సంక్షిప్త జీవిత పరిచయం, వారి మాటల్లోనే*

*- పదకొండవ భాగం.*

## అమృత ద్వారం తెరుచుకుంది

సమ్యక్ సంబోధితో తనకు ప్రాప్తించిన అమరత్వాన్ని ఇతరులకు కూడా లభింపచేయాలనే నిర్ణయం తీసుకున్న బుద్ధ భగవానుడు ఈ విధంగా ధర్మఘోష చేశాడు -

**" అపారుతా తేసం అమతస్స ద్వారా"** - దీఘ నికాయ 2.71.

- అమృత ద్వారం తెరుచుకుంది (ముముక్షువులకు).

ఎవరైతే తమ అంధవిశ్వాసాలను త్యజించి శ్రద్ధాపూర్వకంగా (ముక్తిమార్గాన్ని) వినటానికి సిద్ధంగా ఉన్నారో, వారికోసం అమృత ద్వారం తెరుచుకుంది.

వింటేనే కదా అర్థం చేసుకోగలుగుతారు! అర్థం చేసుకుంటేనే కదా అమృతమార్గం మీద నడవగలుగుతారు! స్వయంగా నడిస్తేనే కదా అమృతాన్ని సాక్షాత్కారం చేసుకోగలుగుతారు.

**అమృతం అంటే ఏమిటి?**

అమృతం అంటే నిర్వాణం ***(నిబ్బాన)***, అది ***(అక్ఖయ)*** అక్షయమైనది అనగా నాశనం లేనిది, ***(అక్ఖర)*** నిత్యమైనది, ***(సివ)*** మంగళకరమైనది, ***(అచ్చుత)*** స్థిరమైనది, నాశనంలేనిది, అజరమైనది, అచలమైనది, ***(ధువ)*** ధృవమైనది, ***(సస్సత)*** శాశ్వతమైనది, ***(అనుప్పాద)*** ఉద్భవించనిది, ***(అజాతి)*** జననం లేనిది (పునరుద్భవించనిది), ***(అనిమిత)*** నిరాలంబమైనది, ***(అగతి)*** భవ సంసరణ చక్రము నుండి ముక్తి పొందినది, ***(సంతిపద)*** శాంతిపదము, పరమసుఖమైనది, విరజమైనది, విమలమైనది, అమలమైనది, అవిపరిణామ ధర్మం కలది. మార్పుచెందని, కూటస్థమైన, అపరివర్తనీయమైన "నిర్వాణం" గురించి

వివరించటానికి ఇలాంటి ఎన్నో పర్యాయపదాలు బుద్ధవాణిలో ఉపయోగించబడ్డాయి.

ఈ నిర్వాణస్థితిని వివరిస్తూ భగవానుడు ఈ విధంగా చెప్పాడు –

*"రాగక్ఖయో దోసక్ఖయో మోహక్ఖయో ఇదం ఉచ్చతి అమతం... నిబ్బానం॥"*

– రాగక్షయమైన, ద్వేషక్షయమైన, మోహక్షయమైన స్థితినే అమృతం అంటారు... నిర్వాణం అని అంటారు.

– సంయుత్తనికాయ 2.4.315

*"ఛన్దరాగవినోదనం నిబ్బానపదమచ్చుతం"* – సుత్తనిపాత 1092

– రాగ తృష్ణ నుండి ముక్తి పొందటమే అచ్యుత నిర్వాణ పథము.

*"నిక్ఖన్త వానతీ" తి నిబ్బాన"* – మజ్ఝిమనికాయ అట్ఠకథా 1.281

– తృష్ణ నుండి పూర్తిగా విముక్తి పొందటమే నిర్వాణము.

*"నిబ్బానం పరమం వదన్తి బుద్ధా"* – దీఘనికాయ 2.90

– బుద్ధులు నిర్వాణాన్ని పరమోన్నత స్థితిగా పేర్కొన్నారు.

బుద్ధవాణిలో నిర్వాణం సర్వోన్నతమైనదని వక్కాణించడమైనది. నిర్వాణం యొక్క గొప్పదనాన్ని, అత్యున్నత శ్రేష్ఠతను ఎన్నోవిధాలుగా వివరించడమైనది –

*"యో చ వస్ససతం జీవే, అపస్సం అమతం పదం।*
*ఏకాహ జీవితం సెయ్యో, పస్సతో అమతం పదం॥"*

– ధమ్మపద 114

– అమృతపదాన్ని (నిర్వాణాన్ని) సాక్షాత్కారం చేసుకోకుండా జీవించే వంద సంవత్సరాల కంటే, అమృతపదాన్ని సాక్షాత్కారం చేసుకుంటూ జీవించే ఒక్కరోజే ఎంతో శ్రేష్టమైనది.

ఈ నిత్యమైన, ధృవమైన, శాశ్వత అమృతపదాన్ని ప్రాప్తింపచేసుకోవటాన్నే బుద్ధ భగవానుడు తన జీవితకాలమంతా బోధించాడు. మన దేశంలో ఉపదేశాలిచ్చే వారు ఎందరో ఉన్నారు. కానీ ఈ మహాపురుషుడు, కేవలం ఉపదేశాలివ్వటమే కాకుండా వాటిని క్రియాత్మకంగా అభ్యాసం చేయడం కూడా నేర్పించాడు. దానికోసం ఉపయుక్తమయ్యే (ఆచరణాత్మకంగా ఉపయోగపడే) సాధనావిధిని బోధించాడు. ఈ అమృతపదం ఎవరి కృపతోనో, దయతోనో, ఆశీర్వాదంతోనో, వరంతోనో ప్రాప్తించదు. అందుకు భిన్నంగా ముముక్షువులు స్వయంగా అప్రమత్తంగా ఉంటూ పరిశ్రమతో, పురుషార్థం చేయాల్సి ఉంటుంది అని వివరించారు. ఈ పనే చేయటాన్ని నేర్పిస్తూ ఆయన ఇలా అన్నాడు –

*"తుమ్హేహి కిచ్చమాతప్పం, అక్ఖాతారో తథాగతా।"*

– ధమ్మపద 276

– తపించే పని స్వయంగా మీరే చేయాలి, తథాగతుడు కేవలం మార్గం మాత్రమే చూపుతాడు."

అందుకే అన్నాడు –

*"అప్పమాదో అమత పదం।"* – ధమ్మపద 21

– ఏమరుపాటు లేకుండా, అప్రమత్తంగా అనుక్షణం సావధానంగా, ఎరుకతో ఉండటమే అమృతపదాన్ని పొందటానికి గల ఏకైక మార్గం. ఈ ఉద్దేశ్యంతోనే ఆయన మార్గాన్ని వెలుగులోకి తెచ్చారు.

*"తథూపమం ధమ్మవరం ఆదేసయి, నిబ్బానగామిన్ పరమం హితాయ।"*

– ఖుద్దకపాఠ 6.13

– ఏ విధంగానయితే వసంత ఋతువులో చెట్లూ – మొక్కలు పుష్పించి ఫలిస్తాయో, అదే విధంగా అత్యంత హితకారి, నిర్వాణం వైపుకు తీసుకువెళ్ళే ఫలవంతమైన ఉత్తమ ధర్మాన్ని మనకు బోధించాడు.

*"సో ధమ్మం దేసేతి ఆదికల్యాణం మజ్ఝేకల్యాణం పరియోసాన కల్యాణం।"*

– దీఘనికాయ 1.190

– ఆదిలోనూ, మధ్యలోనూ మరియు చివరిలోనూ, అన్నింటా కళ్యాణకరమైన ధర్మాన్ని మనకు బోధించాడు.

*"ఆదిమ్హి సీలం దస్సేయ్య, మజ్ఝే మగ్గం విభావయే। పరియోసానమ్హి నిబ్బానం।"* దీఘనికాయ అట్ఠకథా 1.190

– ప్రారంభంలో శీలపాలన చేయటం బోధించాడు; (తదనంతరం) మధ్యే మార్గంలో ప్రయాణించటం (ఎలాగో) బోధించాడు; అంతిమంగా నిర్వాణం వరకూ చేరుకోవడం (ఎలాగో) బోధించాడు.

భగవానుడు ఏయే ధర్మాలను బోధించాడో, అవన్నీ కళ్యాణకరమైనవే. అన్నింటి లక్ష్యమూ ఒక్కటే! సాధకుడు అనుక్షణం మార్పుచెందుతూ ఉండే అనిత్య (అశాశ్వత) బంధనాల నుండి విడుదల పొంది నిత్యమూ, శాశ్వతమూ, ధృవమైన మార్పులేని పరమసత్యాన్ని స్వయంగా అనుభూతిలోకి తెచ్చుకోవాలన్నదే ఆయన ఏకైక ఉద్దేశ్యం.

*"విముత్తిసారా సబ్బే ధమ్మా।"*

– భగవానుని చేత బోధించబడిన ధర్మాలన్నీ విముక్తి యొక్క సార స్వరూపాలే.

*"అమతోగధా సబ్బే ధమ్మా।"*

– ధర్మాలన్నీ అమృతంలో మునక వేయటానికే.

*"నిబ్బానపరియోసనా సబ్బే ధమ్మా।"*

– ధర్మాలన్నీ అంతిమంగా నిర్వాణం కొరకే (ఉద్దేశించబడినవి).

అఙ్గుత్తర నికాయ 3.10.58

ఈ మార్గం ద్వారా మనం చేరుకోవాల్సిన అంతిమ లక్ష్యం నిర్వాణమే

***"తే యన్తి అచ్చుతం ఠానం, యత్థ గత్వా న సోచరే।"***

-ధమ్మపద 225

- (ఈ మార్గంలో అంకుఠితభావంతో నడిచేవారు) పతనం లేని ఆ అచ్యుత స్థితికి చేరుకుంటారు. ఆ స్థితికి చేరుకున్నాక ఇక ఎలాంటి శోకమూ మిగిలి ఉండదు.

ఈ స్థితే మార్గం యొక్క అంతిమ లక్ష బిందువు -

***"అజరం అమరం ఖేమం, పరియేసిస్సామి నిబ్బుతం।"***

- బుద్ధవంస అట్ఠకథా 7, సుమేధపత్థానకథావణ్ణన

- అజరమూ, అమరమూ, క్షేమపూరితమూ అయిన నిర్వాణాన్ని అన్వేషిస్తూ దాని వరకూ చేర్చటమే మార్గం యొక్క అంతిమలక్ష్య చివరి బిందువు.

ఈ స్థితిని సాక్షాత్కారం చేసుకున్నప్పుడు -

***"న చ తే పునముపేన్తి గబ్భసెయ్యం, పరినిబ్బానగతా హి సీతిభూతా।"***

- విమానవత్తు 909

- శీతలీభూత పరినిర్వాణాన్ని పొందిన వారు ***"పునరపి జననీ జఠరే శయనమ్"*** కు చెందిన ఈ దుర్భరమైన దుఃఖంలో పడరు.

దీని కొరకు ఎవరినీ ప్రార్థించటం, వేడుకోవటం ఆయన నేర్పించలేదు, అందుకు భిన్నంగా, ఆర్య అష్టాంగిక మార్గంలో స్వయంగా నడిచి స్వయంకృషితో సాధించుకోవటమే ఆయన నేర్పించాడు.

***"అట్ఠఙ్గికో చ మగ్గానం, ఖేమం అమితగామినన్తి।"***

- ముజ్ఝిమనికాయ 2.215-16

- అష్టాంగికమార్గం క్షేమపూర్ణమైన అమృత స్థితి వరకు తీసుకువెళుతుంది.

ఇదే ***"అమతోగధ మగ్గం"*** - అమృతంలో మునకవేయించే మార్గం.
ఇదే ***"నిబ్బానగామినీ పటిపదా"*** - నిర్వాణాన్ని చేరుకునే మార్గం.

ఇందువల్లనే సతిపట్ఠాన విపశ్యనా సాధనలో ఇలా చెప్పటం జరిగింది -ఈ విద్య ***"సత్తానం విసుద్ధియా"*** - ప్రాణుల విశుద్ధి, విముక్తి కోసం...

***"సోకపరిదేవానం సమతిక్కమాయ"***

- శోకము నుండి, రోదన నుండి ఎల్లప్పటికీ పూర్తిగా బయటపడటానికి...

***"దుఃఖదోమనస్సానం అత్థంగమాయ"***

- దుఃఖమును సమూలంగా నిర్మూలించుకోవటానికి...

***"న్యాయస్స అధిగమాయ"***

- పరమజ్ఞాన ప్రాప్తికోసం...

***"నిబ్బానస్స సచ్ఛికిరియాయ"***

- నిర్వాణాన్ని సాక్షాత్కారింపజేసుకోవడానికి... ఉద్దేశించబడినది.

దీఘనికాయ 2.405

అని ప్రవచించటం జరిగింది.

అయితే దీని కోసం ఎంతో పరిశ్రమించాల్సి ఉంటుంది.

***"తే ఝాయన్తి సాతతికా, నిశ్చం దళహపరక్కమా।"***

***"ఫుసన్తి ధీరా నిబ్బానం, యోగక్ఖేమం అనుత్తరం।"*** - ధమ్మపద 23

- పట్టుదలతో సతతంగా ధ్యానం చేస్తూ, అనుక్షణం దృఢ పరాక్రమంతో (ముందుకుసాగే) ధీరుడైన వ్యక్తే సాటిలేని యోగక్షేమ క్షేత్రమైన నిర్వాణమును ప్రాప్తింపజేసుకుంటాడు.

బుద్ధుని బోధనలు, ఎలాంటి దార్శనిక వాదవివాదాలు కానీ, తర్క వితర్కాలు గానీ కావు. తమని తాము గొప్పవని చూపించే పలుకులు కావు. అవి అన్ని విధాలుగా భవముక్తుడైన మహా కారుణికుని స్వీయానుభూతిజన్యమైన అమృతవాక్కులు. "భవసంసరణ వల్ల సంతప్తులైన మానవాళి ఈ లోకహితకారిణియైన విద్యను నేర్చుకుని ఇందులో పరిపక్వులవ్వాలి. తద్వారా నిత్యమైన, ధ్రువమైన, అమరమైన, అచలమైన, స్థిరమైన నిర్వాణాన్ని స్వంత అనుభూతికి తెచ్చుకుని ***"పునరపి జననమ్, పునరపి మరణమ్, పునరపి జననీ జఠరే శయనమ్।"...*** నకు చెందిన దుఃఖకర సంసార భ్రమణము నుండి ముక్తులవ్వాలి. ఇదే ఆ మహాకారుణ్యమూర్తి యొక్క కరుణాపూరితమైన కోరిక. ఎవరైతే ఆయన చూపించిన మార్గంలో నడుస్తారో, వారు ***"జాతుగబ్భసెయ్యం పునరేతి"....*** మళ్ళీ గర్భశయన దుఃఖంలో పడిపోకుండా సంపూర్ణ ముక్తిని సాధించుకుంటారు.

- ఖుద్దక పాఠ 9.10

బుద్ధుని ద్వారా ఉపదేశించబడిన ఈ సక్రియమైన వ్యావహారిక విద్య నుండి లాభం పొందిన వేల మందిలో కొందరి నోట వెలువడిన వాక్కులు చూద్దాం -

***"అజ్ఝగా అమతం సన్తి, నిబ్బానం పదముచ్చుతం"***

- నాకు అమృతం యొక్క శాంతి మరియు నిర్వాణ అచ్యుతపదం ప్రాప్తించింది.

***"ధమ్మోసధ పివిత్వాన, విసం సబ్బం సమూహతిం"***

- ధర్మ ఔషధాన్ని సేవించి సర్వ సాంసారిక విషాలనూ దూరం చేసుకున్నాను.

***"అజరామరం సీతిభావం, నిబ్బానం ఫస్సయిం అహం।"***

- నేను ఆ అజర-అమర శీతల నిర్వాణాన్ని పొందాను.

*"యేన జాణేన పత్తోసి, అచ్చుతం అమతం పదం।"*

– అపదాన 1.206, 495, 12

– ఆ జ్ఞానంతో నీవు అచ్యుత అమృతపథాన్ని ప్రాప్తించుకున్నావు.

*"పత్తా తే అచలట్ఠానం"* – విమానవత్థు 860

-- నాకు అచల స్థానం (నిర్వాణం) ప్రాప్తించింది.

*"కతన్తం పచ్చవేక్ఖన్తా, ఇమమత్థమభాసిసుం।"* – థేరగాథా నిదానగాథా

– దానిని ప్రత్యక్షీకరణ చేసుకుంటూ (అనుభవైకం చేసుకుంటూ) ఈ సత్యం ప్రకటింపచేసుకోబడుతున్నది.

ఏ వ్యక్తైనాసరే, ఈ ముక్తిమార్గంలో నడిచినప్పుడు అతడు –

*"సంయోజనాని పహాయ సచ్ఛికరిస్సతి।"*– అఙ్గుత్తరనికాయ 2.6.66

– సంయోజనముల బంధనాలను నశింపజేసి (నిర్వాణాన్ని) సాక్షాత్కారింపజేసుకుంటాడు.

ఈ ముక్తి మార్గంలో గత కాలంలో నడిచిన వారికీ, ప్రస్తుత కాలంలో నడుస్తున్న వారికీ, భవిష్యత్తులో నడిచే వారికీ – అందరికీ ఇటువంటి ప్రయోజనాలే చేకూరాయి, చేకురుతాయి కూడా. ఎందువల్లనంటే –

*"నిబ్బానభావం న జహాతీతి।"*

– నిర్వాణం తన నిర్వాణ స్వభావాన్ని వదిలిపెట్టదు. మరి నిర్వాణం యొక్క సహజ నిర్వాణ స్వభావమేమిటి?

*"నిబ్బానం నిచ్చం ధువం సస్సతం అవిపరిణామధమ్మన్తి।"*

– కథావత్థు 286

– నిర్వాణము నిత్యమైనది, ధృవమైనది, శాశ్వతమైనది; అవిపరిణామధర్మం కలది (మార్పు చెందని స్వభావం కలది).

ఈ విధంగా బుద్ధవాణిలో, నిర్వాణం గురించిన వివరణలు, నిర్వాణం వరకూ చేరుకునే మార్గం గురించిన వివరణలు, నిర్వాణాన్ని చేరుకున్న ముముక్షువుల అనుభవాల గురించిన వివరణలు కోకొల్లలుగా ఉన్నాయి.

ఈనాడు కూడా బుద్ధుడు బోధించిన ముక్తిమార్గమైన విపశ్యన వల్ల ఎంతోమంది సాధకులు పొందుతున్న ప్రయోజనాలు ప్రత్యక్షంగా ఋజువవుతున్నాయి. ఎవరు ఎంతెంత పురుషార్థం చేస్తే, వారు తమ అంతిమ లక్ష్యమైన నిర్వాణానికి అంతంత చేరువవుతూపోతారు.

దురదృష్టవశాత్తూ, మూల బుద్ధవాణికి చెందిన విశాల సాహిత్యమూ, ఆయన బోధించిన మంగళకరమైన విపశ్యన సాధన – రెండూ మన దేశం నుండి పూర్తిగా కనుమరుగైపోయాయి. అలా గనుక జరుగకపోయే ఉంటే, అత్యంత మేధాసంపన్నుడైన స్వామీ వివేకానందుని వంటి మహాజ్ఞాని గనుక ఈ విద్యను పొంది ఉంటే, చార్వాకవాదులు వాదించినట్లుగా ''బుద్ధుని బోధనలలో మార్పుచెందనిదీ, నిత్యమైనదీ, శాశ్వతమైనదీ, ధృవమైనదంటూ ఏమీ లేదు" అని ఎలా అనగలిగి ఉండేవాడు? లేదా "దక్షిణాన గల బౌద్ధుల వద్ద మార్పు చెందని నిత్య శాశ్వత ధ్రువమైనవి ఏమీ లేవు" అని ఎలా అనేవాడు? నిజానికి ఆ ప్రాంతాల్లోని బుద్ధానుయాయులందరూ మార్పుచెందని, నిత్య, శాశ్వతమైన నిర్వాణాన్నే తమ జీవితపు అంతిమ లక్ష్యంగా విశ్వసించేవారు.

*– తరువాయి భాగం వచ్చే సంచికలో*

*– పూజ్య గురూజీ సత్యనారాయణ గోయంకా గారు రచించిన "ఆత్మ కథన్ 2" నుండి సంగ్రహించబడినది.*


| | | |
|---|---|---|
| రెండు సంవత్సరాలకు చందా రూ **100/-** | **విపశ్యన తెలుగు మాసపత్రిక** | **జీవిత చందా రూ. 500/-** |
| **ప్రచురణ తేది: ప్రతినెల 30/31** | **పోస్టింగ్ తేదీ: ప్రతి నెల 1/2** | **వెల: రూ 5/-** |

**విపశ్యన అంతర్జాతీయ ధ్యానకేంద్రం, నాగార్జున సాగర్ రోడ్, వనస్థలిపురం, హైదరాబాదు – 500 070.**

**ఫోన్: 24240290 (ధ్యానకేంద్రం) ఆఫీసు పనిచేయు వేళలు: ఉదయం 9గం॥ల నుండి సాయంత్రం 5 గం॥ల వరకు**

Postal Reg. HSE/864/2019-2021 RNI Reg. No. APTEL/2006/17745

**PRINTED MATTER**



If Undelivered please return to :

**VIPASSANA INTERNATIONAL MEDITATION CENTRE,**

12/6KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram,

HYDERABAD - 500 070.

Website : www.vri.dhamma.org

E-mail : info@khetta.dhamma.org



Published for Vipassana International Meditation Centre, 12/6KM, Nagarjuna Sagar Road, Sahebnagar, Vanasthalipuram, Hyd.(A.P)-70 Ph: 040-24240290, Published by Smt. Sabrina Katakam. Editor : Sri G.V.Subrahmanyam., Printed at Sai Likhita Printers, #6-2-959, Dakshin Bharat Hindi Prachar Sabha Complex, Khairatabad, Hyd. Ph : 2332579.